స్కెచ్

# సులోచనాలు

యం. హీరాలాల్ రాయ్

వసంతకాలపు మామిడిగున్నల వగరు వాసనలు గాలిలో కలిసి తోటలోనుంచి బంగళా మీదికి వురికి వస్తున్నాయి. ఎండ తీవ్రం తగ్గి అప్పుడప్పుడే కొద్ది చల్లదనం వ్యాపిస్తున్నది. సాయంత్రం అయిదుగంటలు.

పచ్చని మామిడితోటని చల్లగా చూస్తూ జమీందారుగారు బంగళామీద ముందువైపు కూర్చున్నారు. ఆయన పక్కగా 'అమ్మణి' ఏదో అల్లుకుంటూ నుంచుంది.

అమ్మణికి పద్ధెనిమిదేళ్ళ వయస్సు. జమీందారుగారి ద్వితీయ కుమార్తె. ఆమెకు కళ్ళజోళ్ళంటే చాలా ఇష్టం.

"నాన్నా! కళ్ళజోళ్లు కొనుక్కుందామంటే ఎవ్వరూ ఆప్టీషియన్లు రావడం లేదేం?" అంది అమ్మణి.

"ఈమధ్య రావడంలేదు. నాలుగు మూడు రోజుల్లో ఎవరూ రాకపోతే మదరాసు వెళ్లి జోళ్లు కొనుక్కుందాం. ఈ జోళ్లు పాతబడిపోయినాయి. కొని చాలా కాలం అయింది" అంటూ కాఫీ పుచ్చుకుంటున్నారు జమీందారుగారు.

అమ్మణి అటూ ఇటూ నడుస్తూ తోటలోంచి ఎగిరివచ్చే వగరుగాలి పీలుస్తోంది. అందమైన సాయంకాలపు సూర్యుడు పడమరలోకి జారిపోతూ ఆకాశంనిండా గులాబీ రంగు చిమ్ముతున్నాడు. గులాబీ ఆకాశం ఏటి కాలవలో ప్రతిబింబించి ఎంతో అందంగా వుంది.

"కళ్ళజోళ్ళమనిషి వచ్చాడండీ! తమను దర్శించుకోవాలని కింద నుంచున్నాడు" అన్నాడు గుమాస్తా గబగబా పైకి మెట్లెక్కి వచ్చి.

"రమ్మను రమ్మను" అన్నారు జమీందారు కాఫీ కప్పు బల్లమీద వుంచుతూ.

"నాన్నా! మంచి గ్లాసులు కొనాలీమాటు మంచి విలువైనవి" అంది అమ్మణి.

"ఓ! అలాగే చేతాం" అన్నారు జమీందారు.

చేతిలో నాజూకైన పెట్టె, కళ్ళకి అందమైన జోడు, ఉంగరాలు తిరిగి కొద్దికొద్ది గాలికి కదుల్తూన్న ముంగురులు, పచ్చని మొహం సన్నని శరీరం, కళ్ళలో నవ్వులు, తమాషాగా మెట్లెక్కుతో ధీమాగా పైకి వచ్చాడు ఆప్టీషియన్. జమీందారుగారికి నమస్కారం చేశాడు. అమ్మణికి నమస్కరించాడు. అమ్మణి "గుడీవినింగ్ మిస్టర్!" అంది నవ్వుతో. ఆవిడ నవ్వు ఆప్టీషియన్ గుండెలో వసంతం చల్లింది.

"నీ పేరేమిటి మిస్టర్" అన్నాడు జమీందారు.

"నా పేరు రాజారాం" అన్నాడు ఆప్టీషియన్ సోఫాలో కూచుంటూ.

"మంచి అద్దాలు వున్నాయా" అన్నది అమ్మణి కిటికీదగ్గరకి జరుగుతూ. కిటికీలోంచి దూకివచ్చే వగరుగాడుపులో అమ్మణి బ్లౌసులో దాగివున్న లవండర్ పరిమళం మిళితమై, మనోహరంగా వుంది. ఆ అందాల గాలిని పీలుస్తో ఆప్టీషియన్ రాజారాం తనపెట్టి విప్పాడు.

"లేకేమండీ? నావద్ద క్రూక్స్, మంచి వియన్నా అద్దాలు అమెరికన్ గాగ్ల్స వున్నాయి" అన్నాడు అమ్మణి వైపు చూస్తో. అమ్మణి గబగబా రాజారాంవద్దకు పరుగెత్తుకొచ్చి తనకు నచ్చిన జోడు ఏరుకుంది.

"అదేమంత మంచిది కాదు. ఈ గ్లాసులు చూడండి? ఇవి వియన్నా గ్లాసులు. మీకు నచ్చిన ఫ్రేములో బిగించి ఇస్తాను" అన్నాడు రాజారాం.

"ఏదీ! ఆ గ్లాసులు ఇటు తే" అన్నాడు జమీందారు.

తండ్రికి చూపింది. జమీందారుగారిక్కూడా ఆ గ్లాసులు నచ్చినై. "వీటి విలువ యెంతుంటుంది?" అన్నారు.

"ఆఁ యెంతేండీ! మంచి గ్లాసులు. అయినా విలువ యాభై రూపాయలు" అన్నాడు రాజారాం.

అమ్మణి, జమీందారుగారూ, తెల్లపోయారు.

"ఇంత 'చీప్ క్వాలిటీ' అద్దాలు అక్కర్లేదయ్యా! వెళ్లు! మేం మద్రాసు వెళ్లి తెచ్చుకుంటాం" అన్నారు జమీందారు.

అమ్మణి మాట్లాడలేదు. రాజారాం తన పెట్టె సర్దుతూ విచారంగా మొహం వేలవేశాడు.

"ఏం, అమ్మణీ! మద్రాస్ వెళ్ళి మంచి అద్దాలు తెచ్చుకుందాం" అన్నారు జమీందారుగారు.

రాజారాం తన బసకు వచ్చి విచారంగా కూచున్నాడు. రాజారాం బావ శంకర్ వూళ్ళో మరికొన్ని కోట్ల జోళ్ళు అమ్ముకుని రాత్రి ఏడున్నరకల్లా బసకు వచ్చాడు. "ఇలా వున్నావేం?" అని అడిగాడు రాజారామ్‌ని.

"ఇవాళ బేరం చెడిపోయిందిరా!" అన్నాడు రాజారాం. "ఏడిచావ్! జమీందారు గారి దగ్గరికి వెళ్ళివచ్చావ్! బేరం చెడటం ఏం?" అన్నాడు శంకర్.

"వాళ్ళకి నచ్చిన అద్దాలే యాభై రూపాయలు అని చెప్పేటప్పటికి వద్దన్నారు జమీందారుగారు. మద్రాసు వెళ్ళి తెచ్చుకుంటారట."

"వాళ్ళ మొహం—అంతకంటే మంచి అద్దాలుంటాయా? అయితే ఖరీదు మరీ పెంచి చెప్పాల్సింది. వాళ్ళ మనస్తత్వం నీకు తెలీదురా! విపరీతమైన ధర చెబితే చాలా మంచివనుకుని కొనేస్తారు. తక్కువ ధర చెబితే వద్దంటారు. నేను రేపు వెళ్ళి అమ్ముకొస్తా చూడు అక్కడే-వాళ్లకే—" అన్నాడు శంకర్. రాజారాం విచారంగా నిద్రపోయాడు.

ఉదయాన స్నానం చేసుకుని, కాఫీ పుచ్చుకుని, శంకర్ కళ్ళజోళ్ళ పెట్టెతో జమీందారుగారి బంగళా ముందు నించున్నాడు. "మరో ఆప్టిషియన్ వచ్చాడు నాన్నా!" అంటూ పరుగెత్తుకొచ్చింది అమ్మణి.

"ఏడిచావు వెధవలు!" అన్నాడు జమీందారుగారు.

"కాదు నాన్నా! ఇతను మంచిమంచి గ్లాసులు తెచ్చినట్టున్నాడు" అంది అమ్మణి.

"సరే! రమ్మను" అన్నాడు జమీందారు. అమ్మణి గబగబా బంగళా దిగి పరుగెత్తి 'రండి రండి' అంది శంకర్‌ను. శంకర్ కొంటెగా నవ్వుతూ, అమ్మణివైపు చూశాడు. ఉదయపు గాలిదెబ్బకు అమ్మణి ముంగురులు చెదిరి చెదిరి ఆడుతూన్నాయి. రాజారాం కంటే ఎంతో ఫేర్‌గా వున్న శంకర్ అమ్మణి మనస్సులో గిలిగింత పెట్టాడు.

"నేను ఫారెన్ వెళ్ళివచ్చిన ఆప్టిషియన్‌ను. నావద్ద చాలా మంచి అద్దాలున్నాయండీ!" అంటూ మేడపైకి నడిచాడు అమ్మణితో.

జమీందారుగారికి నమస్కారం చేసి "నేను ఫారెన్ వెళ్ళివచ్చానండీ! నాకు తెలీని అద్దాలంటూ లోకంలో లేవు" అన్నాడు శంకర్ ఇంగ్లీషులో.

"గుడ్! గుడ్!" అన్నారు జమీందారు. అమ్మణి గబగబా శంకర్ దగ్గరకు పరిగెత్తింది.

"ఏదీ! మీ కళ్లు చూడనీండి! మీకు చక్కగా సూటయే అద్దాలిస్తాను" అన్నాడు శంకర్ అమ్మణి కళ్ళల్లోకి చూస్తూ.

అమ్మణి మత్తెక్కిపోయింది. నిన్న రాజారాం చూపిన అద్దాలే అందమైన ఫ్రేమ్‌లో బిగించి తెచ్చాడు శంకర్. ఆజోడు తీసి అమ్మణిమీదికి విసిరేశాడు. "చూడండి! బెస్టు జోడు!" అన్నాడు.

అమ్మణి జోడు తగిలించుకుని అద్దంలో చూచుకుంది.

"బావుంది నాన్నా!" అంది.

"దీని విలువ యెంతుంటుంది?" అన్నారు జమీందారు.

"మూడువందల ఎనభైరెండు. ప్లస్ మూడు. మూడువందల ఎనభై అయిదు" అన్నాడు శంకర్.

"గుడ్, గుడ్" అన్నారు జమీందారు.

చెక్కు తీసుకుని శంకర్ బసకి వచ్చేశాడు.